
# ధర్మసూక్ష్మం



— విజయకుమారి

సాయంత్రం అయిదు గంటలు.

కొట్టు నిండా జనం. వచ్చే వాళ్ళూ, పోయే వాళ్ళూ... కిటకిట లాడిపోతోంది.

సంవత్సరం నిండలే దింకా కొట్టు ప్రారంభించి. ఎంత మార్పు!

సంతోషంతో గుండె నిండిపోయింది. అప్రయత్నంగా నా చేయి మీసాలపైకి వెళ్ళింది.

నిజంగా తన వృత్తితో రాణింపు మనిషి కెంత గర్వకారణం!

హైదరాబాదు అనుభవంతో అతి తొందరలోనే కస్టమర్సుని ఆకట్టుకోగలిగాను. ఇప్పుడు ప్రతి వారికీ, ప్రతి దానికీ షో కావాలి. అందుకే పల్లెటూరికి తగినట్లు కాక షాపును బస్తీ మోడల్‌లో సింగారించాను.

బట్టలు కొనడానికి వచ్చిన వాళ్ళకు ఏ రంగులు నప్పుతాయో, ఎలాటి బట్టలు వేసుకుంటే సినిమా యాక్టర్సులా గుంటారో చెప్పాలి. అ దో అదనపు ఆకర్షణ.

“ఈ డ్రెస్ తీసుకోవయ్యా! అనిల్‌కపూర్ నీ ముందు బలాదూర్...” అంటాను. లేదూ “ఫలానా సినిమాలో చిరంజీవి వేసుకున్నది ఈ డిజైనే...” అంటాను.

ఆడవాళ్ళకీ అంతే. ధర చూసి వెనకా ముందూ ఆడేవాళ్ళు కూడా టక్కున కొనేస్తారు బేరమాడకుండా.

నా కొట్లో బట్టలకు సినిమా పేరో, సినిమా యాక్టరు పేరో విధిగా ఉంటుంది. వ్యాపారంలో ముఖ్య సూత్రం అదే కదా! మనిషి బలహీనత కనిపెట్టగలగాలి.

ఇన్నాళ్ళూ పండుగ బట్టలు, పెళ్ళి బట్టలు ఇలా మంచివి, ఖరీదైనవి కొనాలంటే హైదరాబాదు వెళ్ళేవారు. ఇప్పుడు గిరాకీ అంతా నా కొట్లోనే. ఆ ఊరి వాళ్ళే కాక చుట్టుపక్కల ఉన్న నాలుగైదు గ్రామాల వాళ్ళూ ఇక్కడికే వస్తున్నారు.

ఆరంభంలో ఒక్క కుర్రాడితో జరిగిపోయేది. ఇప్పుడు నలుగురు గుమస్తా లున్నా చాలడం లేదు.

అమ్మకాల జోరు గమనిస్తూ ఆనంద లోకాల్లో విహరిస్తున్న నేను రాములు రాక గమనించలేదు. అతను చెప్పిన వార్త వినగానే పక్కన పిడుగు పడ్డట్లు తుళ్ళిపడ్డాను.

“ఏంటి రాములూ?” అన్నాను అర్థం కానట్లు.

తలపాగా విప్పి చెమట తుడుచుకుంటూ నా ఎదురుగా కూర్చున్నాడు ఫాను గాలి తగిలేలా. "అగ్గో ఇఠల్ సేటు అడిగిండు నిన్ను. ఇయ్యాలన్న రేపన్న వస్తనన్నడు నీ కాడికి."

నన్ను బిగుసుకుపోయేలా చేసింది ఆ ఒక్క వాక్యమే! కాలగర్భంలో కలిసిపోతుందనీ, మరుపుల పొరల్లో మాయమవుతుందనీ ఆశపడ్డ నాకు రాములు చెప్పిన మాట అశని పాతమే అయింది.

అత్తవారింటి తరపు చుట్టం అతడు. నా తరపు వాళ్ళెవరూ హైదరాబాదు పొగలిగిన వాళ్ళు గాని, సేటుకి తెలిసిన వాళ్ళు గాని లేరు. ఆ ధైర్యంతోనే నా ఆచూకీ తెలియకుండా లాక్కొస్తున్నాను. ఈ వాచాలుడు చుట్టరికాలు తిరగేసి నా గుట్టు రట్టు చేసి వచ్చినట్లున్నాడు.

"ఔను గాని, అక్కడి కెందు కెళ్ళావు? ఏ నేముంది నీకు?" అన్నాను కంపిస్తున్న స్వరాన్ని అదుపులో పెట్టుకుంటూ.

"ఏ నేంది... అడ నాకు కాత వుండె."

"ఖాతా నా? నే నుండగా ఎప్పుడూ రాలేదే?"

"అప్పుడు మా యాడది వచ్చి కొంటుండె. అది బాయికాడ బడి కాలు ఇరిగి మంచం బట్టింది గద నాల్నెల్ల బట్టి... ఇంగ నేను పోబడితి."

సరి సరి. నా కర్మకాలి ఆమె కాలు విరిగిందన్నమాట!

"ఏమి ఆలోచన చేస్తున్నవు? రెండేండ్లు నమ్మకంగ పని జేసినవని వస్తున్నడేమో!" అన్నాడు.

నా మొహంలో మారుతున్న రంగులు పసిగట్టినట్లున్నాడు. "ఆలోచనేం లేదు గాని, సేటు మొహం ఎట్లా ఉంది?" అన్నాను రవ్వంత ఆశ మిగిలి.

"సేటు కేమే, మంచిగ ఎర్రగున్నడు... పెద్ద పెద్ద కండ్లు... ఇంత బారు ముక్కు."

మండిపోయింది నాకు. పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణసంకటం అంటే ఇదే.

"అది గాదయ్యా! నా మాట చెప్పేటప్పుడు ఎట్లున్నడు? గుస్సమీ దున్నాడా, ఖుషీతోని ఉన్నాడా అని."

నా ప్రశ్నలోని అంతరార్థం అర్థం అయిందిప్పుడు. "అదా..." అని క్షణం ఆలోచించి - "అది జెప్పనీకె కుదరదు. అప్పుడే కొట్లోని పోరడు చాయ గిలాస ఎత్తేసిండు. సీరలు కొనే టామె మీద చాయ చుక్కలు బడ్డయ్యని లొల్లి పెట్టబట్టె. సేటు ఆమెకు సమఝాయించుకుంట పిల్లగాన్ని తిట్టబట్టె. మరి కోపంగనే ఉన్నడు గాని. అది నీ మీదనా, పిలగాని మీదనా అన్నది ఎట్ల తెలుసుద్ది?"

"సరె తియ్యి" అన్నాను ముగించేస్తూ. భయంతో అతిగా మాట్లాడి నా రహస్యం కాస్తా నేనే బట్టబయలు చేసుకునే లాగున్నాను. ముం దీ మనిషిని ఇక్కడనుంచీ పంపించెయ్యాలి.

కుర్రాడిని పిలిచి టీ తెప్పించా.

"ఎందుకయ్యా చా తెప్పించినవు? తాగే వస్తి" అన్నాడు.

ఆ మాట నిజమే అయితే చా తెమ్మని పంపేటప్పుడే వద్దనే వాడు గదా!

"పర్వాలేదులే తీసుకోవయ్యా. టీ నీళ్ళ కేముంది? ఎన్ని మార్లయినా తాగొచ్చు" అన్నాను గ్లాసు చేతి కిస్తూ.

చుక్క మిగల్కుండా ఊదుకుంటూ తాగి లేచాడు. "మరి నే బొయ్యొస్త." నిశ్చలంగా ఉన్న నీటిలో రాయి వేసి మరీ వెళ్ళాడు.

ఇప్పుడు కొట్లో జనం కనపడ్డం లేదు. గిరాకీ కనపడ్డం లేదు. కొట్టంతా సేటు రూపమే ఆక్రమించింది. "ద్రోహీ! ఇంత మోసం చేస్తావా నమ్మినందుకు?" అంటున్నాడు కళ్ళెర్రజేస్తూ.

అరచేతుల్లో చెమట పట్టింది. అస్తిమితంగా కదలసాగాను నా సీట్లో. మరిచిపోయిన పీడకల లాంటి నా చర్య మళ్ళీ గుర్తు వచ్చి గుండె వేగం హెచ్చింది. వద్దనుకున్నా ఆనాటి సంఘటన సినిమా రీలు లాగా నా కళ్ళ ముందు కదలసాగింది.

అప్పుడు సేటు కొట్లో గుమస్తాగా ఉండేవాడు తను. బి.ఏ. పూర్తయిన తరువాత ఉద్యోగాల వేటలో హైదరాబాదు చేరాడు. అప్పటికే ఉన్న ఎకరం పొలం అమ్మి, కూలి పనులు చేస్తున్నారు తల్లీ, తండ్రీ. తను కూడా అక్కడే ఉంటే తల దాచుకుంటున్న ఆ పాక కూడా అమ్ముకు తినక తప్పదు.

ఉద్యోగం దొరికిందాకా తన ఖర్చులకు డబ్బు కావాలి కదా! అందుకోసం తెలిసిన వారి ద్వారా విఠల్ సేటు కొట్లో సేల్స్‌మన్‌గా చేరాడు. చాలా పెద్ద బట్టల కొట్టు అది. నెలకు అయిదు వందలు ఇచ్చేవాడు.

చిన్న గది అద్దెకు తీసుకుని చౌకబారు హోటల్లో రోజు కొక్క పూట తింటూ పేపర్లో పడ్డ ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టుకుంటూ గడుపుతున్నాడు. రెండేళ్ళు గడిచినా ఉద్యోగం వచ్చే అవకాశం కనుచూపు మేరలో కనపడలేదు.

తన జీవితం ఇలా రోజంతా నిలువుకాళ్ళమీద నిలబడి గుడ్డలు కొలుస్తూ, మడుస్తూ ఉండటంలోనే ముగిసిపోతుందేమో అని భయపడేవాడు. తనతో చదివిన శంకరం ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగస్థు డయ్యాడు. పెళ్ళి చేసుకుని హైదరాబాదులోనే కాపురం కూడా పెట్టాడు. ఇంకా చాలామంది అలాగే క్లర్కులుగా చేరారు.

పెట్టి పుట్టాలి దేనికైనా. తనది దరిద్రపు జాతకం అనడానికి నిదర్శనం చదువు పూర్తయేసరికి తల్లిదండ్రులను కూలీలుగా మార్చాడు. అంతకన్నా ఏం కావాలి?

ఆశ నిరాశల మధ్య రోజులు యాంత్రికంగా గడుస్తుండగా ఓ రోజు నుంచున్న పాటున రమ్మని సేటు ఇంటినుంచి ఫోను చేశాడు.

కొట్లో ఇరవైమంది గుమస్తా లుండగా తననే ప్రత్యేకంగా రమ్మన్నాడు. అ దెంత ముఖ్యమైన పనో - అని మడుస్తున్న చీరలు వదిలి వెళ్ళాడు గబగబా.

గులాబీ రంగు వేసిన రెండంతస్తుల భవనం అది. ఇంటి ముందు పెద్ద తోట. తోట నిండా విరబూసిన పువ్వులు. అన్నీ పెద్ద సైజువే. బంతులు, చేమంతులు, ముద్దమందారాలు, గులాబీలు, పొద్దుతిరుగుడు పువ్వులు.


కానీ ఇంటిని చూస్తే జీవకళ కనపడలేదు. అలంకరించిన శవం గుర్తు వచ్చింది ఎందుకో!

గేటు తోసుకుని లోనికి వెళ్ళాడు. నిశ్శబ్దంగా ఉంది. మనసుకు ప్రశాంతత కలిగించే నిశ్శబ్దం కాదు అది, గుండెల్లో గుబులు పుట్టించే నిశ్శబ్దం.

అడుగుల చప్పుడు విని కాబోలు కర్టెన్ తొలగించుకొని వరండాలో కొచ్చాడు సేటు.

నిర్ఘాంతపోయాడు అతన్ని చూసి... జబ్బెవరికీ అన్న అనుమానం కూడా వచ్చింది తనకి. ఎముకల గూడు లాగున్నాడు మనిషి.

నమస్కారం చెయ్యడం లాంటి లాంఛనం కూడా పాటించలేకపోయాడు. నెల రోజులుగా సేటు మనవడు ఆనంద్ జబ్బుపడ్డ దగ్గర్నుంచి కొట్టుకు రావడం లేదు. పెద్ద గుమస్తానే అన్నీ చూసుకుంటున్నాడు.



ఎంతెంత పెద్ద డాక్టర్లకి చూపినా పిల్లవాడి జబ్బేమిటో తెలుసుకోలేకపోయారు. మందుల దారి మందులదీ, జబ్బు దారి జబ్బుదీ అవుతున్నది. అన్ని రకాల వైద్యాలూ అయాక దుష్టగ్రహ పీడేమో అన్న అనుమానం వచ్చింది. సేటు బావమరిది వాళ్ళ ఊరినుంచి ఒక బాబాగారిని తీసుకొచ్చాడు అంతకు ముందు రోజే.

"రా!" అన్నాడు సేటు లోనికి దారి తీస్తూ. మౌనంగా అనుసరించాడు తను.

గదిలో పెద్ద పందిరి మంచం. మధ్యలో బల్లిలా పరుపుకి అంటుకుపోయిన అయిదేళ్ళ ఆనంద్.

సేటు కోడలు తలమీద ముసుగు ముందుకు లాక్కుంటూ అవతలి కెళ్ళింది తనని చూసి. వనవాసంలో ఉన్న సీతమ్మ తల్లి గుర్తు వస్తుంది ఆమెను చూస్తుంటే. ఆమె కథ తెలిస్తే గుండె కరిగిపోతుంది ఎవరికైనా.

సేటు కొడుకు సకల గుణాభిరాముడు. చదువు అంతంతమాత్రం. బాధ్యతలు అసలు పట్టవు.

సేటు నయానా భయానా ఎన్నో బుద్ధులు చెపుతాడు. తెలిసిన వారితో చెప్పిస్తాడు. చక్కగా వింటాడు. అన్నిటికీ తల ఊపుతాడు అంగీకారంగా. మళ్ళీ తన ధోరణి తనదే. మరీ బెదిరిస్తే అసలు ఇంటిక్ రాడేమో అన్న భయంతో వేడికోళ్ళతోనూ, కన్నీళ్ళతోనూ నచ్చచెపుతుంటారు భార్యా భర్త లిద్దరూ.

పెళ్ళి చేస్తేనైనా బుద్ధి కుదురుతుందని పెళ్ళి చేశారు. ఒక్క ఏడాది వాళ్ళు ఆశించినట్లే ఉన్నాడు ఇంటి పట్టున. భార్య పాతదైపోయింది. కొత్త అందాల కోసం దేశంమీద పడ్డాడు మళ్ళీ.

సేటు అదృష్టం పండి ఆ ఇల్లాలు పండంటి మనవడిని అందించింది. కానీ జీవితంలో మరి బిడ్డలు పుట్టే యోగాన్ని కోల్పోయింది కాన్పు కష్టమై.

ఆ బిడ్డే లేకపోతే వాళ్ళు ముగ్గురూ జీవచ్ఛవాలే! కంటి వెలుగు, ఇంటి దీపం, వంశాంకురం వాడేగా! కనుపాపలా కాపాడుకుంటున్నారు ముగ్గురూ.

"కూర్చో" అన్నాడు సేటు స్టూలు చూపిస్తూ.

"పర్వాలేదు సార్!" అన్నాడు తను నిలబడీ.


"నిన్న వచ్చిన బాబా మంత్రించిన తాయెత్తు ఇస్తా నన్నారు. రేపు ఉదయంలోగా అది బాబు ఒంటిమీద పడాలిట."

ఆయన మాట పూర్తి కాకుండానే అన్నాడు తను - "సార్, మీ రేమనుకోవద్దు. ఈ రోజుల్లో ఇంకా తాయెత్తులు, మహిమలు అని నమ్మడం..."

"నీ ఉద్దేశం నాకు అర్థమైంది. నే నేమీ మూర్ఖంగా ఆయన్ని నమ్మడం లేదు. అలాంటి నమ్మకాలుంటే ఇంతమంది డాక్టర్లకి ఎందుకు చూపిస్తాను? బాబాగారు బాబుని చూస్తూనే మాకు తప్ప పైవారికి తెలియని ఎన్నో సంగతులు చెప్పారు. ఇది అనారోగ్యానికి సంబంధించిన జబ్బు కాదు, మందులకు తగ్గటానికి. బాబుని పట్టి పీడిస్తున్న దుష్టగ్రహం ప్రాణాలు హరించి గాని వదలదు అన్నారు. ఎప్పుడు పట్టిందీ, ఎలా పట్టిందీ కూడా వివరంగా చెప్పారు. ఇక నమ్మకుండా ఎలా ఉండగలం? ఆ ప్రేతాత్మ బాబుని వదిలిపెట్టి పోయేందుకు తాయెత్తు ఇస్తా నన్నారు. అది ఒంటిమీద ఉన్నంతవరకూ బిడ్డకేమీ పర్వాలేదు. అది గాని కట్టకపోతే పిల్లవాడు ఎల్లుండి సూర్యోదయం చూడడు. ఏ శక్తి నన్ను ఇక్కడకు రప్పించిందో గాని అది మీ అదృష్టం. అన్నారు. ఈ రాత్రి పూజ చేసి తావీదు తయారుచేసి ఉంచుతాను. ఎవరినైనా మా ఆశ్రమానికి పంపి తెప్పించుకోండి అని చెప్పారు నిన్న వెళుతూ."

"మరి ఇప్పటివరకూ ఆగా రెందుకు సార్? పొద్దునే వెళ్ళేవాడినిగా..." అన్నాడు తను. అప్పటికే టైం ఎనిమిది గంటలయింది.

ఆయన తల వంచుకున్నాడు. "పొద్దునే పంపాను మా అబ్బాయిని డబ్బు లిచ్చి. ఇప్పు డొస్తాడు, అప్పు డొస్తాడు అని సాయంత్రంవరకూ ఎదురుచూస్తూనే ఉన్నాం. వరంగల్లు వెళ్ళి రావడానికి అమాత్రం టైం చాలుగదా! ఇందాకే తెలిసింది, వాడి స్నేహితు లెవరో కనపడితే పొద్దునే బొంబాయి మెయిల్ ఎక్కాడని" అన్నాడు మెల్లగా.




ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. కన్న బిడ్డ ప్రాణాపాయస్థితిలో ఉన్నా స్పందించలేని ఆ మనిషి స్వభావం ఎలాటిది? అలాంటి వాడిని బిడ్డగా భరిస్తున్న సేటు ఎంత దయనీయుడు!

"నిన్ను తప్ప ఎవరిని పంపనూ నాకు నమ్మకం చాలలేదు. అందుకే నిన్ను పిలిపించాను. ఉదయానికంత అంటే సూర్యోదయం కాకముందే ఏ పరిస్థితుల్లోనైనా తేగలగాలి..."

"తప్పకుండా సార్! బస్సో, రైలో ఏదో ఒకటి పట్టుకుని వెళతాను. తెల్లవారుజాము కంత తిరిగి వస్తాను."

"స్టేషను నుంచి అయిదు మైళ్ళు కాలి నడకన వెళితే గాని ఆశ్రమం రాదుట. రిక్షాలు, బళ్ళూ ఏమీ ఉండవన్నారు. జన సంచారం కూడా ఉండదుట. అర్ధరాత్రి మరి..." అనుమానిస్తూ అన్నాడు సేటు.

"మీ రింకే సందేహాలు పెట్టుకోవద్దు సార్! నేను ఎలా వెళతానో, ఎలా తెస్తానో పొద్దు పొడవకుండా మీ కా రక్ష రేకు ఇస్తే సరి!" నమ్మకంగా అన్నాడు తను.

సేటు కళ్ళనిండా కృతజ్ఞత తళ తళ లాడింది. "చల్లగా నూరేళ్ళూ బ్రతుకు నాయనా!" సేటు భార్య ఆశీర్వదించింది రెండు చేతులూ ఎత్తి.

సేటు కోడలు ఏమనుకొని ఉంటుందో మనసులో!

సేటు డబ్బు లిచ్చాడు - "ఈ వెయ్యినూటపదహార్లు బాబాగారి కివ్వు. డబ్బులు పైసా పుచ్చుకోరుట. భగవంతుడి దీపారాధన ఖర్చుకి వాడమని చెప్పు. నా ఇంటి దీపం నిలబెడుతున్న ఆ దేవుడికి కొన్నాళ్ళయినా నేను నేతి దీపం పెడతాను. ఈ అయిదు వందలూ నీ ఖర్చుల కుంచు..."

"నాకు అయి దొందలు ఎందుకు సార్!"

"వస్తానంటే టాక్సీ చేసుకు వెళ్ళు. రైళ్ళను, బస్సులను నమ్మకూడదు. టైం చాలా తక్కువ ఉంది మనకు" అన్నాడు సేటు.

మారు మాట్లాడకుండా డబ్బు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు గడువు లోపల వస్తానని మరో మారు చెప్పి బయట పడ్డాడు.

నడిస్తే ఆలస్య మవుతుందని రిక్షా ఎక్కి రూం చేరాడు. ఇప్పుడు డబ్బు కన్నా కాలానికే విలువ ఇవ్వాలి. తాళం తీసి లోనికెళ్ళాడు. తేమ గాలితో కూడిన మెతక వాసన వికారం కలిగించింది. మొహం చిట్లించుకుని లైటు వేశాడు. రకరకాల దయ్యాల డిజైన్లలో భయపెట్టే పెచ్చులూడిపోయిన గోడలు, 'ఎప్పుడో నాకు కచ్చి పుడితే నీ నెత్తిన కూలక మానను' అని బెదిరిస్తున్న పైకప్పు.

రోజూలా ఇంటినీ, భవిష్యత్తునీ తీరిగ్గా తిట్టుకునే సమయం లేదు. బాత్‌రూంలో దూరి రెండు చెంబుల నీళ్ళు గుమ్మరించుకుని స్నానం అయిం దనిపించాడు. ఉన్న వాటిలో కాస్త గట్టిగా ఉన్న పాంటూ, షర్టూ వేసుకుని తల దువ్వుకుంటూ ఉండగా దూసుకొచ్చాడు శంకరం.

"రమేషా!" నన్ను కావలించుకుని ఏడవటం

మొదలుపెట్టాడు.

"ఏమిట్రా, ఏమైంది?" గాభరాగా అడిగాడు తను. వాడి భార్య గర్భవతి, నిండు నెలలు.

"సావిత్రికి నొప్పు లొస్తుంటే ఆస్పత్రికి తీసుకెళ్ళాను. బిడ్డ అడ్డం తిరిగిందట. ఆపరేషను చెయ్యాలన్నది డాక్టరు."

వాడి మాట పూర్తి కాకుండానే - "ఏ ఆస్పత్రి? పద పద" అని బయటకు లాక్కొచ్చి కనపడ్డ రిక్షా ఎక్కారు.

తలుపు వెయ్యాలి, తాళం పెట్టాలి అన్న విషయం తట్టలేదు. అయినా దోచుకుపోయేంత విలువైన సామానులేం ఉన్నాయి కనుక. గుడ్డికన్ను మూస్తే ఎంత, తెరిస్తే ఎంత?

పది నిముషాల్లో ఆస్పత్రి చేరారు.

శంకరాన్ని చూస్తూనే డాక్టరు ఇంతెత్తున ఎగిరింది. "నీ కసలు బుద్ధుందా? ఆపరేషను చెయ్యాలి అని అంటే ఏ మాటా చెప్పకుండా పోయావు? ఆ మనిషి కేమైనా అయితే ఎవరిది బాధ్యత?" మండిపడింది.

"ఆపరేషను అవసరమైతే చెయ్యండి డాక్టరుగారూ! వాడు చేప్పే దేముంది?" అన్నాడు తను వెంటనే అందుకుని.

"ఆ మాట మాకు తెలును. నిన్నేం సలహా అడగడం లేదు. రెండు వేలు కట్టాలి ముందు." చురచురా చూసిం దామె.

రెండు వేలా? వాడి నెత్తిన రూపాయి పెట్టి అమ్మినా అర్ధరూపాయకు కొన రెవరూ. నుంచున్న పాటున ఎక్కడనుంచి తేగలడు అంత డబ్బు!

లేకపోతే... సావిత్రి... నవమాసాలూ మోసిన తొలిచూలు బిడ్డ... ఏమవుతారు?

ఇంకా భూమిమీదకు రాని ఆ బిడ్డ గురించి ఎన్నెన్ని కలలు కనేవారు ఇద్దరూ. ఆ ఆనందంలో తనూ పాలుపంచుకున్నాడు చాలాసార్లు. గుండె ఆగిపోతుందేమో అన్నంత భయం కలిగింది. అప్రయత్నంగా చేతులు గుండెమీదికి వెళ్ళాయి.

అక్కడ చేతులకు... ఎత్తుగా మెత్తగా...

జేబులో చెయ్యి పెట్టాడు గబుక్కున. సేటు ఇచ్చిన డబ్బులు. ప్రాణం లేచొచ్చింది. వాటి మాటే గుర్తు లేదు. మొత్తం తీసి ఆమె చేతిలో పెట్టాడు.

"డాక్టరుగారూ! ఇవి పదహారు వందలు... మిగిలినవి రేపు తెచ్చిస్తాము" అన్నాడు చేతులు జోడించి.

ఆలోచించడానికి టైం లేదు. చావు బ్రతుకుల సరిహద్దు రేఖ అతి సున్నితమైనది.

ఏమాత్రం తొట్రుపడినా, వెనకముం దాడినా ఒక నిండు ప్రాణం గాలిలో కలిసిపోతుంది. ఒక చిన్న సుఖ సంసారం ఛిన్నాభిన్న మవుతుంది.

లెక్కపెట్టుకుంటూ లోని కెళ్ళిం దామె.

నమ్మలేనట్లు చూశాడు శంకరం తన వైపు.

నిజమే, తన దగ్గర పదహారు పైసలు కూడా ఉండవని వాడికీ తెలును. తన కొచ్చిన కష్టం ఎవరికి చెప్పుకోవాలో తెలియక నా దగ్గర కొచ్చాడు కాని, ఆదుకోగలడన్న నమ్మకంతో కాదు.

"రమేషూ! నీ ఋణం ఎలా తీర్చుకోగలనురా?" కాళ్ళమీద వాలిపోయాడు.

వాడిని లేపి, కళ్ళు తుడిచి, వీపు తట్టాడు.

ఇద్దరూ అక్కడే ఉన్న బల్లమీద కూర్చున్నారు, మూసుకున్న తలుపులవైపు చూస్తూ.

ఇప్పటికే ఆలస్యమైందని తిట్టిం దామె. ప్రమాదం తొలగిపోయిందా? మరింత జటిలమైందా?

"భగవంతుడా! తల్లీ, బిడ్డలను బ్రతికించి వాడి సంసారం నిలబెట్టు." ప్రార్థించారు కళ్ళు మూసుకుని.

"నా బిడ్డను చంపి, నీ స్నేహితుడి బిడ్డను బ్రతికిస్తున్నావా? దుర్మార్గుడా!" కోపంగా, దీనంగా చూస్తోంది సేటు కోడలు.

"పాపాత్ముడా! నమ్మినందుకు ఇంత ద్రోహం చేస్తావా?" నిప్పులు కురిపిస్తున్నాడు సేటు.

"మా ఉసురు తగలదూ? సర్వనాశన మవుతావు!" శపిస్తోంది సేటు భార్య.

ఒళ్ళంతా చెమటతో ముద్దయిపోయింది.

'ఇప్పు డేం చేయాలి?' సమస్య పెనుభూతంలా నిలిచింది ఎదుట. 'ఇటు నుంచి ఇటు పారిపోతే?' రకరకాల ప్లానులు.

నా ఆలోచనలను చెదరకొడుతూ పసిబిడ్డ ఏడుపు. మరో అయిదు నిముషాలకు తలుపులు తెరుచుకున్నాయి. చేతులు తుడుచుకుంటూ నవ్వు మొహంతో వచ్చింది డాక్టరమ్మ. "మగ బిడ్డ. తల్లీ, బిడ్డా క్షేమంగా ఉన్నారు. వెళ్ళి చూసి రండి. ఆమెను మాత్రం మాట్లాడించవద్దు" అని చెప్పి, ఆఫీసు రూంలో కెళ్ళింది.

పట్టలేని ఆనందంతో నన్ను కౌగలించుకున్నాడు శంకరం. "నా ఇంట్లో దీపం పెట్టావురా! ఈ పుణ్యం అంతా నీదే." ఉక్కిరి బిక్కిరి చేశాడు నన్ను.

మరొకప్పుడయితే వాడికన్నా ఎక్కువ ఆనందపడేవాడు. బలవంతాన మొహానికి నవ్వు పులుముకుని - "పద, చూసి వద్దాం..." అన్నాడు.

గదిలో కెళ్ళారు. బిడ్డ చాలా అందంగా ఉంది. సావిత్రి మత్తుగా పడి ఉన్నది.

"ఇక్కడ మీ రెవరూ ఉండక్కర లేదు. రేపు రండి..." అంది నర్సు.

అప్పటికి పన్నెం డయింది.

శంకరం వా ళ్ళింటి కెళ్ళాడు. తను రూం కొచ్చాడు. యాంత్రికంగా చాపమీద వాలాడు. మెదడు మొద్దుబారి ఆలోచించే శక్తిని కోల్పోయింది. కళ్ళు మూసుకుంటే చాలు గర్భ శోకంతో తల్లడిల్లిపోతున్న సేటు కోడలి రూపం కనిపించి గుండె లవిసిపోతున్నాయి.

ఆత్మహత్య ఒకటే శరణ్యంగా తోస్తున్నది. అంతకు మించి మరో దారి కనిపించలేదు ఎంత ఆలోచించినా. కానీ.. కానీ... ప్రాణం తీసుకోడానికి ఎంత ధైర్యం కావాలి! అనుకున్నంత సులభంగా కనపడలేదు అది కూడా. సంకల్పమాత్రంగానే ప్రాణం పోతే ఎంత బాగుండును!

పిచ్చి పిచ్చి ఆలోచనలతో తల బద్దలైపోతుందేమో అన్నంత బాధ కలుగుతోంది.

తెల్లవారుజామునకు ఒక ఉపాయం తట్టింది. చటుక్కున లేచాడు. క్షణం కూడా వ్యర్థపరచకూడదు మరి. తను చేస్తున్న పాపపు పనిని క్షమించమని భగవంతుని వేడుకున్నాడు ముందుగా.

మూలనున్న తాటాకు బుట్టనుంచీ చిన్న ముక్క తుంచి నీళ్ళలో నానవేశాడు. వణుకుతున్న చేతులతో దానిమీద కాళీమాత పేరు సూదితో రాసి చుట్టగా చుట్టాడు.

ఇప్పుడు పసుపూ, కుంకుమా రాసిన దారం కావాలి. దారం ఉంది గాని పసుపూ, కుంకుమా లేవు. తొమ్మిది కొడితే గాని కొట్లు తియ్యరు... ఎలా!

ఇంటి వారిని కాస్త పసుపూ, కుంకుమా కావాలని అడిగాడు. వాళ్ళు తనవైపు వింతగా చూసి, చిన్న కాగితంలో పోసి ఇచ్చారు నవ్వుకుంటూ.

పసుపు దారం తాటాకు చుట్టకు నిండుగా చుట్టాడు. దానికి కుంకుమ బొట్లు పెట్టాడు ఒత్తుగా. ఒక కాగితంలో పొట్లం కట్టుకుని బయలుదేరాడు నడుస్తున్న ప్రేతంలా.

గేటు తోసుకుని లోనికి అడుగు పెడుతుంటే కాళ్ళు గజగజా వణకసాగాయి. తన మొహం ఎలా ఉండి ఉంటుందో అద్దం చూసుకోకుండా చెప్పగలడు.



సేటు వరండాలోనే ఉన్నాడు తనకోసం ఎదురుచూస్తూ.

పొట్లం ఆయన చేతుల్లో పెట్టాడు తల వంచుకుని.

సేటు మొహంలోకి వెలుగొచ్చింది - "బాబాగారు ఏం చెప్పారు?" అన్నాడు, దాన్ని భద్రంగా పట్టుకుని. అందులో మనవడి పంచప్రాణా లున్నాయని ఆయన నమ్మకం.

"సాంబ్రాణి పొగ వేసి కట్టమన్నారు. భయం లేదని చెప్పమన్నారు" అన్నాడు తను కూడబల్కుంటూ. ఆ రెండు వాక్యాలూ చెప్పడానికి ఎంతో ప్రయత్నం చేయవలసి వచ్చింది.

"వంచకుడా! పుట్టగతు లుంటాయా నీకు?" నిందిస్తోంది అంతరాత్మ.

"వీలైనంత త్వరగా ఇక్కడనుంచి బయటపడు..." తొందర చేస్తోంది మనసు.

"సార్... ఇంటికి... అమ్మ... మా అమ్మ..." అన్నాడు మాటలు వెదుక్కుంటూ - "ఆఁ... ఏమి మీ అమ్మకు బాగోలేదా ఏం? పో మరి... అవరమైతే వారం రోజులు ఉండే రా..." అన్నాడు సేటు పొద్దు పొడవకుండా తాయెత్తు కట్టాలన్న తొందరలో.

పరిగెత్తినట్లే బయటపడ్డాడు. బస్సెలా ఎక్కాడో, ఇంటి కెలా చేరాడో తనకే తెలియదు.

తనని చూసి అమ్మ మొహం చేటంతయింది. "ఇయ్యాల నీకు కారడు రాపిద్దా మనుకుంటుంటి. పిలిచినట్లొస్తివి. ఆఁ... చూసినవా ఎవ రొచ్చిండ్రో..." తనను పరామర్శించడం, నాయనను పిలవడం అంతా కలగాపులగం చేసింది అమ్మ సంబరంగా.

నాయన లోనుంచి వచ్చాడు - "వచ్చినవా, మంచి గయింది..." అన్నాడు నవ్వు మొహంతో.

పని పోయినట్లు తెలిస్తే ఎలా మారిపోతారో వీళ్ళు! నన్ను పరిశీలనగా చూసి ఉంటే పసిగట్టగలిగేవారేమో గాని; వాళ్ళు ఏదో మహదానందంలో మునిగి తేలుతున్నారు.

"పన్నెండు గొట్టేరి. కాళ్ళు కడుక్కురా. బువ్వ తిందువు. తినుకుంట చెప్పుకోవచ్చులే ముచ్చట" అంది అమ్మ మురిపెంగా.

అప్పుడు తెలిసింది ఆకలి బాధ. బొగ్గుతో బరబర పండ్లు తోమి, స్నానం చేసి వచ్చాడు.

కంచంలో అన్నం పెట్టి, కారం ముద్ద వేసి ఇచ్చింది అమ్మ. నాయన తన పక్కనే కూర్చుని చెప్పుకొచ్చాడు.

"పైన లున్నోళ్ళు. పిల్ల మంచిగుంటది. సదువుకున్నోని కియ్యాల్నని కోరికంట. ఇన్నాళ్ళూ బట్టల కొట్లో పని నేర్చుకున్నావు గనక పరదచ్చిన కింద దుకునం పెట్టిపిస్తరు ఈ ఊర్లోనే."

గుండెమీద నించి పెద్ద బండరాయి తీసేసినట్లు తేలిగ్గా ఫీలయ్యాడు. మరొకప్పుడయితే పల్లెటూరి పిల్లను చేసుకోననేవాడు. గవర్నమెంటు ఉద్యోగం రావాలనేవాడు.

ఆ నెలలోనే పెండ్లి జరిగింది. కొట్టూ పెట్టించారు. హాయిగా సాగిపోతున్నాయి రోజులు.

మళ్ళీ ఇప్పుడు సేటు వెతుక్కుంటూ రావడ మెందుకు? ఇప్పుడు తెలిసిందా తను చేసిన మోసం! ఏం చేయాలని వస్తున్నాడు?

నాకు మళ్ళీ గుండె దడ ఆరంభమయింది. రేపు కొట్టు కట్టేసి ఎటన్నాబోతే? సాయంత్రం దాకా చూసి తిరిగి వెళ్ళిపోతాడు. ఎందుకైనా మంచిది. ఇప్పుడు కూడా పనున్నట్లు ఊళ్ళోకి పోయి పొద్దు పోయినాక తిరిగి వస్తే? ఈ ఆలోచన చాలా బాగా నచ్చింది.

ఏదో ఒక రకంగా సేటు ఎదుట పడకుండా తప్పించుకోవడమే కదా కావలసింది!

కేష్ బాక్సుకు తాళం పెట్టి, పెద్ద గుమస్తాను పిలిచాను - "అర్జెంటు పనిమీద బయట కెళ్తున్నాను. లెక్క జాగ్రత్తగా చూసుకో" అని చెప్పి మెట్లు దిగానంతే.

ఎదురుగా యమదూతలా ఆగి ఉన్న చిన్న కారు, అందులోంచి దిగుతున్న సేటు.

నా గుండె క్షణం కొట్టుకోవడం మానేసింది. కానీ ఆ వెంటనే మరింత వేగంగా కొట్టుకోసాగింది.

సేటు వెనకే దిగుతున్న ఆనంద్‌ని చూసి.

మొదటిది అతి భయంవల్ల నయితే, రెండోది అతి ఆశ్చర్యంతో... కలా, నిజమా? అర్థం కాలేదు. మునుపటి కన్నా ఆరోగ్యంగా ఉన్నాడు పిల్లాడు.

"ఏమి రమేషూ! బాగున్నావా? పెండ్లి చేసుకున్నావట, కొట్టు పెట్టుకున్నావట తెలియనివ్వకపోతివి!" అంటున్నాడు సేటు నా దగ్గరగా వస్తూ.

అతడి మాట లేవీ నాకు వినిపించడం లేదు - "సార్... సార్... బాబు..." అన్నాను సంభ్రమంగా.

"అవును రమేషూ! వాడు బతికున్నాడంటే, నేను బతికున్నానంటే నీదే ఈ పుణ్యం. నువ్వు చేసిన మేలు మరిచిపోలేనయ్యా. సమయానికి రక్ష రేకు తెచ్చిచ్చి మా ఇల్లు నెలబెట్టావు. ఏమన్నా నీకు బహుమతి ఇద్దామంటే నీ పత్త చెప్పినేవాళ్ళు లేరు. ఇవ్వాళ రాములు నీ గురించి చెప్పగానే ఆలస్యం చెయ్యకుండా వచ్చా నందుకే. నీకేం కావాలన్నా ఏ సహాయం కావాలన్నా నేను చేస్తాను. నువ్వు నా బిడ్డతో సమానం" అన్నాడు సేటు అభిమానంగా నా చేతులు పట్టుకుని.

చాలాసేపటివరకూ జరుగుతున్న సంఘటన యథార్థమని నమ్మలేకపోయాను. ఇలా జరగాలని ఊహించుకుంటున్నానేమో. అని కూడా అనిపించింది.

కాసేపు కూర్చుని తిరిగి వెళుతూ సేటు మరోసారి గుర్తు చేశాడు బహుమతి అందుకోడానికి రమ్మని.

అలాగేనని చెప్పి, పిల్లవాడికి ఖరీదైన బట్టలు పాక్ చేసి ఇచ్చాను.

ఎంత ఆలోచించినా నాకు అర్థం కానిది ఏమంటే తాయెత్తులో మహిమ ఉంటుందని నమ్మినా నకిలీ తాయెత్తు పిల్లవాడిని ఎలా రక్షించింది?

నేను చేసింది మోసం, పాపం. అది యథార్థం. మరి నాకు అన్నీ ఇలా కలిసి వస్తున్నా యెందుకు?

ఎవరు చెబుతారు ఈ ప్రశ్నలకు సమాధానం?

★

